

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 26.01.2026 | సంపుటి : 2 | సంచిక :350 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 26.01.2026 | volume : 2 | Issue : 350 | Pages : 8 | Cost : 2/- |


## ప్రజల భాగస్వామ్యంతోనే
# జలవనరుల పునరుద్ధరణ

- అనంతలో జల సంరక్షణ భేష్
- కరువు జిల్లాలో ప్రజలు, యంత్రాంగం సంయుక్త కృషితో నీటి వనరుల అభివృద్ధి
- 7 వేలకు పైగా మొక్కలు కూడా నాటారు
- 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసలు

**న్యూఢిల్లీ, జనవరి 25 :** ప్రజల భాగస్వామ్యంతోనే జలవనరుల పునరుద్ధరణ సాధ్యమని ప్రధాని మోదీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో ప్రజలు, అధికారులు కలిసి చేపట్టిన జలసంరక్షణ చర్యలను ఆదివారం తన 'మన్‌కీ బాత్' ప్రసంగం సందర్భంగా ప్రశంసించారు. అనంతపురం జిల్లాలో జరిగిన నీటి సంరక్షణ పనులను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. "తీవ్ర కరువుతో, ఎర్ర నేలలతో ఎడారిని తలపించే అనంతపురంలో నీటి ఎద్దడి ప్రధాన సమస్యగా ఉండేది. అక్కడ ఎక్కువ ప్రాంతాల్లో వర్షాలు

మిగతా 2 లో



## భారత రాజ్యాంగం
# ప్రపంచానికే ఆదర్శం

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ, జనవరి 25 :** దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ప్రస్తుతం స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నారని ముర్ము అన్నారు. మన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని ప్రజాస్వామ్యం ఎన్నో సవాళ్లను అధిగమించిందని తెలిపారు. అభివృద్ధి ఫలాలు దేశ ప్రజలకు అందుతున్నాయని విద్య, వైద్య రంగాల్లో






## ఓటు హక్కు
# వజ్రాయుధం

- బాధ్యతాయుత ఓటింగ్‌తోనే ప్రజాస్వామ్యం బలపడుతుంది
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బాధ్యత, అవగాహనతో ఓటు హక్కును వినియోగించినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థలు బలంగా నిలుస్తాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

02

# వికసించిన పద్మాలు

### ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ప్రకటించిన కేంద్రం
### ఈ ఏడాది మొత్తం 131 మందికి పద్మ అవార్డులు



- ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్
- 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు
- ధర్మేంద్ర, వీఎస్ అచ్యుతానందన్‌లకు పద్మవిభూషణ్
- మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌లకు పద్మభూషణ్
- రోహిత్, హర్మన్‌ప్రీత్, మురళీమోహన్‌లకు పద్మశ్రీ
- తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖులకు దక్కిన గౌరవం

గణతంత్ర దినోత్సవ వేళ కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. 2026 సంవత్సరానికి గాను ఆదివారం విడుదల చేసిన ఈ జాబితాలో వివిధ రంగాలకు చెందిన 131 మంది ప్రముఖులకు స్థానం దక్కింది. ఇందులో 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. ఈసారి అవార్డు గ్రహీతల్లో 19 మంది మహిళలు ఉండగా, 16 మందికి మరణానంతరం పురస్కారాలు ప్రకటించారు. అలాగే విదేశీయులు, ఎన్నారైల విభాగంలో ఆరుగురు ఎంపికయ్యారు. కళలు, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్, వైద్యం, సాహిత్యం, క్రీడలు తదితర రంగాల్లో నిష్ణాతులైన వారికి పద్మ పురస్కారాలు ప్రకటించారు.



# ఓటుతోనే మార్పు సాధ్యం

- చదువుకున్నవారే ఓటుకు దూరమవడం విచారకరం
- భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు

**హైదరాబాద్, జనవరి 25 :** సమాజంలో మేధావులుగా చలామణి అయ్యే వారు ప్రభుత్వాలను విమర్శిస్తారని, ఓటు వేయడానికి మాత్రం ముందుకు రారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఆదివారం జాతీయ ఓటరు దినోత్సవం

మిగతా 2 లో

## ధరణి అక్రమాలపై
# కఠిన చర్యలు

- ప్రపంచంలోనే అత్యుత్తమంగా 'భూభారతి'
- రూ.వేల కోట్ల కుంభకోణం ప్రతిపక్షాల ఆరోపణే..
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం, జనవరి 25 :** "గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిన ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి, ప్రపంచంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దిన భూభారతి చట్టాన్ని మా ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది" అని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాలో శిక్షణ పూర్తిచేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు 47 మందికి కలెక్టరేట్‌లో ఆదివారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ధరణి'లో తప్పులను సవరించి, ఆధార్ కార్డుల్లా భూములకు భూధార్ సంఖ్య కేటాయిస్తామన్నారు.



మిగతా 2 లో

## సైట్ విజిట్ నిబంధన తెచ్చిందే
# కాంగ్రెస్ ప్రభుత్వం

### బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు

**హైదరాబాద్, జనవరి 25 :** సింగరేణిలో ఓవర్ బర్డెన్ రిమూవల్ పనుల్లో సైట్ విజిట్ నిబంధన తీసుకొచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. సింగరేణి స్కాంను సమర్థించుకునేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధం లేని కాగితాలను చూపిస్తూ అబద్ధాలను వండి వార్చారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "సింగరేణి స్కామ్‌కు ఎవరు బాధ్యులు? ఎంతనష్టం వాటిల్లింది? లబ్ధిపొందిన వారెవరు? ఈ మూడు ప్రశ్నలకూ భట్టి సమాధానం చెప్పకుండా దాటవేశారు. 2018లోనే




మిగతా 2 లో



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 242 (కిలో) |
| స్కిన్ లెస్ | 276 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72

## నాంపల్లి అగ్నిప్రమాదంలో
# ఐదుగురి మృత్యువాత

- ఒకరినొకరు పట్టుకుని ఇద్దరు చిన్నారులు..
- వారిని కాపాడేందుకు వెళ్లి ఇద్దరు..
- బయటకు రాలేక మరో మహిళ సజీవదహనం
- ఫర్నిచర్ దుకాణం యజమాని అరెస్ట్

02

హైదరాబాద్ నాంపల్లి స్టేషన్‌రోడ్‌లోని బచ్చాస్ ఫర్నిచర్ దుకాణంలో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. 22 గంటల పాటు పోలీసులు, అగ్నిమాపకశాఖ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు శ్రమించి ఆదివారం ఉదయం 11 గంటలకు ఐదు మృతదేహాలను వెలికితీశాయి. పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు అప్పగించారు. ఫర్నిచర్ దుకాణ యజమాని సతీష్‌బచ్చా(54)పై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.



## భారత రాజ్యాంగం
# ప్రపంచానికే ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

దేశం ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని ముర్ము పేర్కొన్నారు. మన రైతులు దేశానికి అవసరమైన పోషకాహారాన్ని సమృద్ధిగా అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు ఘన విజయం అందించిన త్రివిధ దళాలను ముర్ము ప్రశంసించారు. రాజ్యాంగ నిర్మాతలు నిబంధనలు ద్వారా జాతీయవాద స్ఫూర్తికి దేశ ఐక్యతకు బలమైన పునాదిని అందించారని, ప్రస్తుతం భారత ప్రజలమైన మనము గణతంత్ర దినోత్సవాన్ని దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. భారత గణతంత్ర ఉత్సవాలు దేశ భూత, వర్తమాన, భవిష్యత్తు పరిస్థితులకు అద్దం పడుతాయన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం దేశ పరిస్థితిని పూర్తి స్థాయిలో మార్చి వేసిందని ఈ ముర్ము పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమిళ భాషలో వందేమాతరం యోన్బేమ్ అనే గీతాన్ని స్వరపరిచిన జాతీయవాద కవి సుబ్రమణ్య భారతిని ద్రౌపది ముర్ము ప్రశంసించారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే
# జలవనరుల పునరుద్ధరణ

(మొదటిపేజీ తరువాయి)

పడవు. అందుకే.. అక్కడి ప్రజలు అనంతపురాన్ని ఎడారితో పోలుస్తారు. ఈ తీవ్రమైన పరిస్థితుల్లో స్థానిక ప్రజలు, యంత్రాంగం కలిసి నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం అవి నీటితో కళకళలాడుతున్నాయి. దీనితోపాటు 7 వేలకు పైగా మొక్కలు నాటారు. తద్వారా అనంతపురంలో నీటి సంరక్షణతోపాటు పచ్చదనం కూడా పెరిగింది. ఒక విధంగా చెప్పాలంటే అక్కడి మొత్తం పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరించబడింది. అక్కడి ప్రజలు, పాలకులు చేసిన ఈ సామూహిక కృషి ఎంతో గర్వకారణం" అని మోదీ కొనియాడారు. అలాగే యూపీలోని ఆజంగఢ్ ప్రజలు తమ ప్రాంతంలో ప్రవహించే తంసా నదిని పునరుద్ధరించిన తీరును అభినందించారు. కాలుష్యం, పూడిక, చెత్తాచెదారంతో నిండిన ఆ నదిని ఓ ఉద్యమంలా శుభ్రం చేశారన్నారు. దేశ ప్రజల్లో ఉన్న సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించుకునే తత్వం అద్భుతమని పేర్కొన్నారు.




# ఓటు హక్కు వజ్రాయుధం

**హైదరాబాద్, జనవరి 25 :** బాధ్యత, అవగాహనతో ఓటు హక్కును వినియోగించినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థలు బలంగా నిలుస్తాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది థీమ్ "నా భారత్- నా ఓటు" పౌరులే భారత ప్రజాస్వామ్యానికి కేంద్రబిందువని స్పష్టంగా తెలియచేస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం భారత ఎన్నికల సంఘానికి కల్పించిన స్వతంత్రత, నిష్పక్షపాతమైన స్వేచ్ఛాయుత, న్యాయ-సమ్మతం ఎన్నికలకు పునాది అన్నారు. అంబేడ్కర్, మహాత్మాగాంధీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలవదని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, అర్హులైన ఓటర్లకు హోం ఓటింగ్, ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా ఎన్నికలు మరింత సమగ్రంగా మారాయని ప్రశంసించారు. జూబ్లీహిల్స్(61) అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను డ్రోన్ నిఘా, పోలీసు సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించిన తీరును ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం 3.39 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందుకోసం 35,895 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లలో 1.68 కోట్ల మంది పురుషులు, 1.70 కోట్ల మంది మహిళలు, 2890 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారని చెప్పారు. గత జాతీయ ఓటర్ల దినోత్సవం నుంచి ఇప్పటివరకు సుమారు 3.93 లక్షల మంది కొత్త ఓటర్ల జాబితాలో చేరినట్లు ఆయన వెల్లడించారు. ఓటరు జాబితా సవరణ లక్ష్యం నిజమైన ఓటర్ల తొలగింపు కాదని, రెండు చోట్ల ఉన్న ఓటర్లు, అనర్హులను తొలగించడమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుముదిని, అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ధరణి అక్రమాలపై
# కఠిన చర్యలు

నూతన చట్టంలో భాగంగానే భూముల సమగ్రసర్వేకు 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామన్నారు. మిగతా జిల్లాల్లోనూ రెండు, మూడు రోజుల్లో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారన్నారు. గతంలో ధరణిని అడ్డంపెట్టుకుని పాల్పడిన అక్రమాలను వెలికితీసేందుకు కేరళకు చెందిన ఓ సంస్థకు ఫోరెన్సిక్ ఆడిట్ బాధ్యత అప్పగించామన్నారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో అందిన నివేదికలను పరిశీలిస్తున్నామని, మిగతా జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. భూభారతి వచ్చాక వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని, అవన్నీ ధరణిలో లొసుగులతోనే చోటుచేసుకున్నాయని, రూ.వేల కోట్ల కుంభకోణం ఏమీలేదని, కేవలం రూ.3.9 కోట్లు దారి మళ్లాయని గుర్తించామన్నారు. జనగామ జిల్లాలో కొన్ని మీసేవా కేంద్రాల్లో జరిగిన అక్రమాలు వెలికితీసి దోషులను అరెస్టు చేసినట్లు వివరించారు.

### మున్సిపల్ ఎన్నికల్లో పైరవీలకు తావు లేకుండా టికెట్లు

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని సేకరించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏదులాపురం పురపాలిక ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 15లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. పైరవీలు, వారసత్వాలకు తావులేదని, సర్వేల ఆధారంగా టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. టికెట్ దక్కనివారికి ఏదోరూపంలో సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పోటీచేయాలని ఎవరు రెచ్చగొట్టినా మోసపోవద్దని సూచించారు. వార్డులవారీగా నాయకులతో ముఖాముఖి నిర్వహించి స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు.

# వికసించిన పద్మాలు

**న్యూఢిల్లీ, జనవరి 25 :** గణతంత్ర దినోత్సవ వేళ కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. 2026 సంవత్సరానికి గాను ఆదివారం విడుదల చేసిన ఈ జాబితాలో వివిధ రంగాలకు చెందిన 131 మంది ప్రముఖులకు స్థానం దక్కింది. ఇందులో 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. ఈసారి అవార్డు గ్రహీతల్లో 19 మంది మహిళలు ఉండగా, 16 మందికి మరణానంతరం పురస్కారాలు ప్రకటించారు. అలాగే విదేశీయులు, ఎన్నారైల విభాగంలో ఆరుగురు ఎంపికయ్యారు. కళలు, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్, వైద్యం, సాహిత్యం, క్రీడలు తదితర రంగాల్లో నిష్ణాతులైన వారికి పద్మ పురస్కారాలు ప్రకటించారు. దేశానికి అసాధారణ సేవలందించినందుకు ఇచ్చే పద్మవిభూషణ్ పురస్కారం ఈసారి బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్రసింగ్ దేవల్ (మహారాష్ట్ర), కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్‌లను మరణానంతరం వరించింది. వీరితో పాటు ప్రజా వ్యవహారాల విభాగంలో కె.టి.థామస్(కేరళ), కళల విభాగంలో ఎన్.రాజమ్(ఉత్తరప్రదేశ్), సాహిత్యం, విద్య విభాగంలో పి.నారాయణన్ (కేరళ) ఈ అత్యున్నత గౌరవానికి ఎంపికయ్యారు. ఇక విశిష్ట సేవలకుగాను ఇచ్చే పద్మభూషణ్ జాబితాలో ప్రముఖ గాయని అల్కా యాగ్నిక్, మలయాళీ నటుడు మమ్ముట్టి, మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోష్యారీ, పారిశ్రామికవేత్త ఉదయ్ కోటక్, టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్, ప్రచార రంగ దిగ్గజం పియూష్ పాండే వంటి వారున్నారు. తెలుగు రాష్ట్రాలకు ఈసారి పద్మ పురస్కారాల్లో పెద్దపీట దక్కింది. ఆంధ్రప్రదేశ్ నుంచి సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్‌ను కళల విభాగంలో పద్మశ్రీ వరించింది. అలాగే గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్(కళలు), మరణానంతరం గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్(కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి(సాహిత్యం) ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డి(కళలు), వైద్య రంగంలో గూడూరు వెంకట రావు, పాల్కొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి పద్మశ్రీ అందుకోనున్నారు. సైన్స్ రంగంలో చంద్రమౌళి గడ్డమణుగు, కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్, కుమారస్వామి తంగరాజ్, పశుసంవర్ధక విభాగంలో రామారెడ్డి మామిడి (మరణానంతరం) తెలంగాణ కీర్తిని ఇనుమడింపజేశారు. అలాగే.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మాజీ చైర్మన్, తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన మామిడాల జగదీశ్ కుమార్ సాహిత్యం, విద్యా రంగంలో పద్మశ్రీ వరించింది.



## నాంపల్లి అగ్నిప్రమాదంలో
# ఐదుగురి మృత్యువాత

**హైదరాబాద్, జనవరి 25 :** హైదరాబాద్ నాంపల్లి స్టేషన్‌రోడ్‌లోని బచ్చాస్ ఫర్నిచర్ దుకాణంలో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. 22 గంటల పాటు పోలీసులు, అగ్నిమాపకశాఖ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు శ్రమించి ఆదివారం ఉదయం 11 గంటలకు ఐదు మృతదేహాలను వెలికితీశాయి. పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు అప్పగించారు. ఫర్నిచర్ దుకాణ యజమాని సతీష్‌బచ్చా(54)పై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఫర్నిచర్ దుకాణం సెల్లార్ గదిలో యాదయ్య, లక్ష్మి దంపతులు, పిల్లలు ప్రణీత్(11), అఖిల్(7)తో కలసి ఉంటున్నారు. యాదయ్య వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటే.. లక్ష్మి ఇళ్లల్లో పనిచేస్తోంది. సుభాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇంతియాజ్(26) దుకాణంలో సేల్స్‌మ్యాన్‌గా.. సయ్యద్ హబీబ్(30) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కర్ణాటక బీదర్‌కు చెందిన బీనాబీ(50) స్వీపర్‌గా పనిచేస్తోంది. ముందురోజు యాదయ్య కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లి రావటంతో ఆలస్యమైంది. దీంతో శనివారం ఉదయం యాదయ్య దంపతులు పిల్లలిద్దర్నీ స్కూలుకు పంపకుండా ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో దుకాణం వెనుకనుంచి వ్యాపించిన మంటలు సెల్లార్‌లోకి పాకాయి. రెండు సెల్లార్ల నిండా మూడు కంటైనర్ల ఫర్నిచర్, రసాయనాల డ్రమ్ములకు అంటుకొని ప్రమాద తీవ్రత పెరిగింది. క్షణాల్లో మంటలు, పొగ పెరగడంతో సెల్లార్‌లో ఉన్న ముగ్గురూ బయటకు రాలేకపోయారు. దుకాణం బయట ఉన్న ఇంతియాజ్, హబీబ్ చిన్నారుల్ని కాపాడేందుకు సెల్లార్‌లోకి వెళ్లి తిరిగి రాలేకపోయారు. అగ్నిమాపక సిబ్బంది శ్రమించి ఆదివారం ఉదయం సెల్లార్‌లోకి ప్రవేశించి మొదటి మృతదేహం గుర్తించారు. వాచ్‌మెన్ కుటుంబం ఉంటున్న గదిలో నిర్జీవంగా పడివున్న చిన్నారులను చూశారు. స్వీపర్ బీనాబీ అగ్నికి ఆహుతైంది. ఇంతియాజ్, హబీబ్‌ల మృతదేహాలు చెరోదిక్కున పడి ఉన్నాయి. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తిచేశారు. చిన్నారుల మృతదేహాలతో కుటుంబసభ్యులు ఆందోళన నిర్వహించారు. ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మృతదేహాలను నల్గొండ జిల్లా యర్రగండ్లపల్లి గ్రామానికి తరలించారు. నాగ్‌పూర్ నుంచి వచ్చిన నిపుణుల బృందం ప్రమాద స్థలాన్ని పరిశీలించింది.



### రసాయనాలతో పెరిగిన ప్రమాద తీవ్రత

ఫర్నిచర్ దుకాణం సెల్లార్‌లో ఫర్నిచర్, రసాయనాలు నిల్వ చేయడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని అగ్నిమాపకశాఖ డీజీ విక్రమ్‌సింగ్‌మాన్ తెలిపారు. సెల్లార్ చివర్లో రెండు గదులు ఏర్పాటు చేశారన్నారు. మెట్లమార్గంలో ఐరన్ షట్టర్‌కు తాళం వేసి ఉన్నట్లు గుర్తించామని.. లోపలివారు బయటకు వచ్చేమార్గం లేకపోవడంతో మరణాలకు కారణమని తెలిపారు. అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌వోసీ(అనుమతి) తీసుకోలేదన్నారు. మిగిలిన అనుమతులున్నా సెల్లార్లను అక్రమంగా వినియోగిస్తున్నట్లు వివరించారు.

### మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

నాంపల్లి అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రమాదంలో ఐదుగురు అమాయకులు చనిపోవడం తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు పరిహారం అందజేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరిచందనకు ఆదేశాలిచ్చాం. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.



## వచ్చే ఎన్నికల్లో గెలిచేది
# జాగృతి పార్టీయే : కవిత

**హైదరాబాద్ :** భారాస హయాంలో సింగరేణిలో టెండరు ధర కన్నా ఎక్సెస్‌కు ఇవ్వలేదని ఆ పార్టీ నాయకులు అబద్ధాలు చెప్పటం సరికాదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "సింగరేణిలో సైట్ విజిట్ నిబంధన గతంలో కన్వేయర్ బెల్ట్ లాంటి వాటికి ఉండేది. ఇప్పుడు ఓబీకి కూడా పెట్టారు. కేటీఆర్ ఏ విషయమైనా అధ్యయనం చేసి మాట్లాడతారని అనుకునేదాన్ని. కానీ భారాస ప్రభుత్వంలో ఎక్సెస్‌కు టెండర్లు ఇవ్వలేదని ఆయన అన్నారు. నిజానికి చాలా టెండర్లను ఎక్సెస్‌కు ఇచ్చారు. సీఎం బావమరిదికి భారాస హయాంలోనూ కాంట్రాక్టులిచ్చారు. కానీ ఆయనను పెద్దగా చూపి.. ఒక బడా కాంట్రాక్టర్‌కు రూ.25 వేల కోట్ల పనులు కట్టబెట్టేందుకు హరీశ్‌రావు ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ ఓడిపోయే పార్టీ.. వచ్చే ఎన్నికల్లో గెలిచేది జాగృతి పార్టీయే. నేను కాంగ్రెస్‌లోకి వెళ్తున్నానని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌నే మా పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం. ఆయన వస్తే నేషనల్ కన్వీనర్ పోస్ట్ ఇస్తాం. ఫోన్ ట్యాపింగ్ విచారణను ఓ జోక్‌గా మార్చారు. నాలాంటి బాధితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు" అని కవిత తెలిపారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను
# తరిమికొట్టాలి
### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**కొత్తగూడెం :** తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సింగరేణి గని కార్మికులు కాంగ్రెస్, భారాసలను తరిమికొట్టాలని కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొత్తగూడెం నగరంలోని కొత్తగూడెం క్లబ్‌లో భాజపా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల విజయ సంకల్ప సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 50 రోజులు సమ్మె చేసిన సింగరేణి కార్మికులు ఇప్పుడు రాష్ట్రం ఎటుగా పోతోందో ఒక్కసారి ఆలోచించాలన్నారు. 12 ఏళ్ల వ్యవధిలో కనీసం కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లోకి రాష్ట్రం వెళ్లిపోయిందన్నారు. సంస్థకు రావాల్సిన రూ.51 వేల కోట్లు ప్రభుత్వం తీసుకుంటే కార్మికులకు జీతాలు ఎక్కడనుంచి వస్తాయని ప్రశ్నించారు. కేసీఆర్ సింగరేణికి రూ.35 వేల కోట్లు అప్పుపెట్టి పోతే, కాంగ్రెస్ ఆ భారాన్ని రూ.51 వేల కోట్లకు చేర్చిందన్నారు. మజ్లిస్ అండతో కాంగ్రెస్ పురపాలిక ఎన్నికలు గెలుచుకోవాలని చూస్తోందని విమర్శించారు. మోదీ కార్యదక్షత, భాజపా సమర్థ పాలనను వివరించి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేషన్‌తోపాటు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో భాజపా అభ్యర్థులను గెలిపించాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మార్తినేని ధర్మారావు, విజయచందర్‌రెడ్డి, కె.వి.రంగాకిరణ్, జి.వి.కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటుతోనే
# మార్పు సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)


సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యాలయంలో కొత్తగా ఓటు హక్కు పొందిన వారితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "చదువుకున్నవారిలోనే ఓటింగ్ శాతం తగ్గుతుండటం ఆందోళనకరం. తుపాకులు పట్టుకుని, బాంబులు వేసి, ఉగ్రవాదంతో సమాజాన్ని మార్చలేరు. ఓటుతోనే మార్పు సాధ్యమవుతుంది. ఇందిరాగాంధీ హయాంలో ప్రజాస్వామ్యాన్ని అణచివేసేలా ఎమర్జెన్సీ విధించారు. తర్వాత ప్రజలు ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పారు. వాజ్‌పేయి హయాంలో పార్లమెంటులో ఒక్క ఓటుతో ప్రభుత్వం కోల్పోయినా.. తరువాత ప్రజలు ఆయన ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకున్నారు" అని రామచంద ర్‌రావు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలకు, పద్మ పురస్కారాలు పొందిన తెలుగు వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతంరావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ కుండే తదితరులు పాల్గొన్నారు.

## సైట్ విజిట్ నిబంధన తెచ్చిందే
# కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

సైట్ విజిట్ సర్టిఫికెట్ ప్రతిపాదన ఉందని ఉపముఖ్యమంత్రి చెప్పారు. కానీ 'సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్స్టిట్యూట్ లిమిటెడ్(సీఎంపీడీఐ)' ఇచ్చిన సిఫార్సు.. కేవలం పరిమిత ప్రాంతాల్లో జరిగే డిజైన్, సరఫరా, ఇన్‌స్టలేషన్, కమిషనింగ్ పనులకు మాత్రమే వర్తించే సాంకేతిక నిబంధన. సైనిక్ స్కూల్ వారు సైట్ విజిట్ నిబంధన పెట్టింది కూడా 'సప్లై అండ్ ఇన్‌స్టలేషన్ ఆఫ్ క్లాత్ డ్రైయర్' కోసం.. దీన్ని సింగరేణి ఓబీ కాంట్రాక్టుకు లింకు పెట్టి చూపడం హాస్యాస్పదం. ఒకవేళ 'సీఎంపీడీఐ' సిఫార్సు ఓబీ పనులకే అయితే.. 2018 నుంచి 2024 వరకు సింగరేణి పిలిచిన వందలాది ఓబీ టెండర్లలో ఈ షరతు ఒక్కసారి కూడా లేదు.. ఇప్పుడు 2025-26లో కొన్ని ఎంపిక చేసిన టెండర్లకే.. అకస్మాత్తుగా ఎందుకు తీసుకొచ్చారు.. 2025 మే తర్వాత ఓబీ రిమూవల్ కాంట్రాక్టర్లకు ఏ టెండర్ వచ్చినా.. సైట్ విజిట్ సర్టిఫికెట్ ఎవరికి ఇవ్వాలన్నా.. సీఎం సూత్రధారి, ఆయన బావమరిది పాత్రధారి.. అలాంటప్పుడు విచారణ కోసం ముఖ్యమంత్రితో మాట్లాడితే న్యాయం జరుగుతుందా? ఒక నైనీ గోల్డ్ బ్లాక్ టెండర్ రద్దు చేయడమే కాదు.. సైట్ విజిట్ సర్టిఫికెట్‌తో ఖరారైన టెండర్లన్నీ రద్దు చేయాలి. వీటిపై శ్వేతపత్రం విడుదల చేయాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

## ఫిబ్రవరి రెండో వారంలో
# పుర ఎన్నికలు
### కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం




**నిజామాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు రెండు మూడ్రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని, ఫిబ్రవరి రెండో వారంలో పోలింగ్ జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్, ఆర్మూర్‌లో ఆదివారం జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో మంత్రి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశాం. 85 శాతం మంది అర్హులకు కొత్త కార్డులు జారీ చేశాం' అని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ దేవుడి పేరుతో ఓట్ల రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. మతం పేరుతో ఓట్లడిగే వారిని ప్రజలు నమ్మొద్దన్నారు. తమకు భాజపా ఎంతదూరమో మజ్లిస్ కూడా అంతేదూరం అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, నిజామాబాద్ గ్రామీణం ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పాల్గొన్నారు.



## అమెరికా దాడి భయం..

### బంకర్‌లోకి ఇరాన్ సుప్రీం లీడర్..

**యూఎస్ :** అమెరికా దాడి చేస్తుందనే భయాలు ఇరాన్‌ను చుట్టుముట్టాయి. దీంతో దేశాధినేత రక్షణ కోసం అధికారులు చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని అధికారులు టెహ్రాన్‌లోని సురక్షితమైన బంకర్‌కు తరలించినట్లు సమాచారం. అమెరికా దాడి చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సీనియర్ మిలిటరీ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో అత్యంత సురక్షితమైన బంకర్‌లో ఖమేనీ ఆశ్రయం పొందుతున్నట్లు తెలుస్తోంది. దీన్ని టెహ్రాన్‌లోని పలు సొరంగాలకు అనుసంధానం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సుప్రీం లీడర్ తన కార్యాలయ బాధ్యతలను చిన్న కుమారుడు మసూద్ ఖమేనీకి అప్పగించినట్లుగా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కార్యనిర్వాహక వర్గంతో సమన్వయ పనులు కూడా ఆయనే చూడనున్నట్లు తెలిపాయి. అయితే, ఈ వార్తలపై ఇరాన్ అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన లేదు. ఇరాన్‌లో పరిపాలనకు వ్యతిరేకంగా భారీ నిరసనలు చలరేగాయి. ఈ క్రమంలో జరిగిన ఘర్షణల్లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనకారులకు హాని కలిగితే రంగంలోకి దిగుతామని హెచ్చరించారు. ఆ దేశంపై సైనిక చర్యకు కూడా సిద్ధమవగా.. చివరి నిమిషంలో రద్దు చేసుకున్నారు. అయితే, ఇటీవల భారీ సంఖ్యలో తమ యుద్ధ నౌకలు ఇరాన్ వైపు కదులుతున్నాయని ఆయన ప్రకటించడం భయాందోళనకు దారి తీసింది.



## కెనడాలో భారత సంతతి వ్యక్తి హత్య

**కెనడా :** కెనడాలో భారత సంతతికి చెందిన దిల్ రాజ్ సింగ్ గిల్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బ్రిటిష్ కొలంబియాలోని బర్నబే వద్ద చోటుచేసుకొంది. వాంకోవర్ వాసి అయిన దిల్‌రాజ్ హత్య వెనుక గ్యాంగ్ వార్ కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నెల 22న '3700 కెనడా వే'లో కాల్పులు జరిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకొనే సరికి అక్కడ ఓ వ్యక్తి రక్తపుమడుగులో పడి ఉన్నాడు. అతడిని కాపాడేందుకు పోలీసులు యత్నించినా.. ఫలితం లేకపోయింది. ఆ తర్వాత బక్స్ టోన్ వీధిలో ఓ వాహనం తగలబడటాన్ని అధికారులు గుర్తించారు. ఈ రెండు ఘటనల మధ్య సంబంధం ఉండి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గిల్ అక్కడి పోలీసులకు తెలిసిన వ్యక్తి కావడం గమనార్హం.



## మారిన ట్రంప్ స్వరం..

### యూకే దళాలను ప్రశంసిస్తూ పోస్టు

**యూఎస్ :** అఫ్గానిస్థాన్‌తో యుద్ధంలో నాటో దేశాలు దూరంగా ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంలో ట్రంప్ స్వరం మార్చారు. యూకే సైనికుల కృషిని ప్రశంసిస్తూ.. ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. యూకేకు చెందిన గొప్ప, ధైర్యవంతులైన సైనికులు యూఎస్‌కు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. అఫ్గాన్‌లో మరణించిన 457 మంది యూకే సైనికులు, తీవ్రంగా గాయపడిన వారిని గొప్ప యోధులుగా అభివర్ణించారు. ఇరుదేశాల మధ్య ఉన్న సైనిక బంధం ఎప్పటికీ విచ్ఛిన్నం కాలేనంత బలంగా ఉందన్నారు. కాగా.. ఇటీవల ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తమకు అవసరమైనప్పుడు నాటో దేశాలు అండగా ఉంటాయని తాను అనుకోవడం లేదన్నారు. అయినా వారి అవసరం మాకు లేదన్నారు. ఈ క్రమంలోనే అఫ్గాన్ యుద్ధంలో అమెరికా సేనలే ముందు ఉన్నాయని, నాటో దేశాలు దూరంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. దీనిపై బ్రిటన్ ప్రధాని స్టార్మర్ తీవ్రంగా స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలు తమ సైనికులను అవమానించడమేనని.. దీనికి ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. ఈ క్రమంలోనే బ్రిటిష్ సైనికులను ప్రశంసిస్తూ ట్రంప్ పోస్టు పెట్టడం గమనార్హం.

# హెచ్-1బీ దరఖాస్తుదారులకు షాక్

### స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027లోకి మార్పు



**యూఎస్ :** భారతీయ వృత్తి నిపుణులకు అమెరికా ప్రయాణాల్లో మరింత జాప్యం చోటుచేసుకోనుంది. హెచ్-1బీ వీసాల స్టాంపింగ్ ఇంటర్వ్యూల అపాయింట్‌మెంట్లు 2027లోకి మారాయి. కొత్త ఇంటర్వ్యూల స్లాట్లకు కొరత ఏర్పడటంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వేలాది మంది వృత్తి నిపుణులు భారత్‌లోనే చిక్కుకుపోయే పరిస్థితి నెలకొంది. మరికొందరి ఉద్యోగాలు ప్రమాదంలో పడే పరిస్థితి తలెత్తింది. భారత్‌లోని అమెరికా కాన్సులేట్లలో బ్యాక్‌లాగ్‌లు భారీగా పెరిగిపోయాయి. ఫలితంగా వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027లోకి మారాయి. వాస్తవానికి డిసెంబర్ 2025లో వీటిల్లో తొలిసారి జాప్యం చోటుచేసుకొంది. నాడు ఇంటర్వ్యూలను మార్చి 2026కు మార్చాల్సివచ్చింది. ఆ తర్వాత ఆ తేదీలు అక్టోబర్‌కు.. ఇప్పుడు 2027కు మారినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా కేంద్రాల్లో కొత్త ఇంటర్వ్యూ స్లాట్లు లేవు. దీంతో ప్రస్తుతం ఉన్న అపాయింట్‌మెంట్లను అధికారులు 18 నెలలు తర్వాతకు మార్చాల్సి వచ్చింది. ఫలితంగా 2027 సంవత్సరం మధ్యలోకి అవి చేరాయి. దీంతో ఇమిగ్రేషన్ నిపుణులు ప్రస్తుతం అమెరికాలో ఉన్న వృత్తి నిపుణులు వీసా స్టాంపింగ్ కోసం తిరిగి భారత్‌కు వెళ్లవద్దని సూచిస్తున్నారు. హ్యూస్టన్‌కు చెందిన ఇమిగ్రేషన్ సంస్థ భాగస్వామి ఎమిలీ న్యూమన్ మాట్లాడుతూ.. తాము గత 50 రోజుల్లో భారత్ కోసం కొత్త వీసా ఇంటర్వ్యూల స్లాట్లు ఉన్నట్లు చూడలేదన్నారు. అదే సమయంలో అమెరికాలో ఉన్న వృత్తి నిపుణులు కూడా భారత్‌లో స్టాంపింగ్ ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ల కోసం ప్రయత్నించడంలేదని చెప్పారు. 2027 వరకు ఎటువంటి రెగ్యులర్ అపాయింట్‌మెంట్లు లేవని 'అమెరికన్ బజార్' వెల్లడించింది. ఇప్పటికే స్టాంపింగ్ కోసం భారత్‌కు వచ్చిన వారికి కూడా ఇంటర్వ్యూలు రద్దైనట్లు చెప్పారని తెలిపింది. జనవరి, ఫిబ్రవరిలో అపాయింట్‌మెంట్లు ఉన్న వారికి కూడా.. వాటిలో మార్పులు చేసి ఏడాది తర్వాతి డేట్లను కేటాయిస్తూ ఈమెయిల్స్ వచ్చాయి. ఇప్పటికే వీసా స్టాంపింగ్ కోసం భారత్‌కు చేరుకొన్న వేలాది మంది వృత్తి నిపుణులు తిరిగి అమెరికా వెళ్లలేక ఇక్కడే చిక్కుకుపోయారు. వీరిలో కొందరి భార్యపిల్లలు అమెరికాలో ఉండగా.. తల్లిదండ్రులు భారత్‌లో ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంప్లాయిమెంట్ కాంట్రాక్టులు, హౌసింగ్ అగ్రిమెంట్లలో సమస్యలు తలెత్తుతున్నాయి. వీసా గడువు ముగిసిన చాలా మంది ఉద్యోగులకు.. వారి సంస్థల యజమానులు పొడిగింపులను కూడా ఇవ్వడంలేదు. దీనికి తోడు లక్ష డాలర్ల ఫీజు ఉండటంతో కొత్త హెచ్-1బీ వీసాల కోసం కంపెనీలు దరఖాస్తులు చేయడంలేదు. మరోవైపు ఈ సమస్యను మరింత జఠిలం చేసేలా అమెరికా విదేశాంగ శాఖ కొన్నాళ్ల క్రితం కీలక నిర్ణయం తీసుకొంది. దీని ప్రకారం భారతీయులు మరో దేశంలోని అమెరికా కాన్సులేట్లలో వీసా స్టాంపింగ్ చేయించుకునే అవకాశాన్ని నిలిపివేసింది. దీంతో భారతీయ కాన్సులేట్లలో అపాయింట్‌మెంట్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది.

## శుభాంశు శుక్లాకు అశోక చక్ర.. ముగ్గురికి కీర్తి చక్ర

**న్యూఢిల్లీ :** భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు కేంద్రం ప్రతిష్ఠాత్మక సైనిక పురస్కారం 'అశోక చక్ర'ను ప్రకటించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాంశు రికార్డు సృష్టించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సాయుధ దళాలకు చెందిన 70 మంది సిబ్బందికి శౌర్య పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. వీరిలో ఆరుగురికి మరణానంతరం ప్రకటించారు. మేజర్ అర్ష్‌దీప్ సింగ్, నాయబ్ సుబేదార్ డోలేశ్వర్ సుబ్బా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌లకు 'కీర్తి చక్ర' పురస్కారాలు వరించాయి. 13 మందికి 'శౌర్య చక్ర', ఒకరికి బార్ టు సేన పతకం, 44 మందికి సేన, ఆరుగురికి నౌ సేన, ఇద్దరికి వాయుసేన పతకాలు ప్రకటించారు.



#### కీలక మిషన్‌లో భాగం..

గతేడాది నిర్వహించిన యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా విజయవంతంగా అంతరిక్ష యాత్ర పూర్తి చేసిన విషయం తెలిసిందే. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నియెస్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లతో కలిసి ఐఎస్ఎస్‌కు వెళ్లిన శుభాంశు.. అంతరిక్షంలో అనేక ప్రయోగాలు చేశారు. ఖగోళంలోని జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై అధ్యయనం చేశారు. ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను చిత్రీకరించారు. అంతరిక్షంలో వ్యోమగాముల మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం చేశారు.

## వాయుకాలుష్యం..

### కోట్లాదిమందిపై భారం: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ :** వాయు కాలుష్యం సమస్య కారణంగా ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా చిన్నారులు, వయోవృద్ధుల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. ఈ సంక్షోభాన్ని విస్మరించకూడదని, మార్పు దిశగా మొదటి అడుగు మన గళాన్ని వినిపించడమేనని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. "వాయు కాలుష్యం కారణంగా ఆరోగ్యం, ఆర్థిక రూపంలో ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. కోట్లాది మంది సామాన్య పౌరులు రోజూ ఈ భారాన్ని మోస్తున్నారు. ప్రజల జీవనోపాధి దెబ్బతింటోంది. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలపై తీవ్ర ప్రభావం పడుతోంది" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వాయు కాలుష్యం ఎలా ప్రభావితం చేసిందో ప్రజలు తమ అనుభవాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల గొంతుకను వినిపించడం తన కర్తవ్యమని చెప్పారు. దిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. దేశ రాజధానికి ఊపిరి పోయడానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇందులో భాగంగా కేంద్రంతో పాటు దిల్లీ ప్రభుత్వానికి స్పష్టమైన గడువు విధించింది. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) సూచించిన సిఫార్సులను ఎలా అమలు చేస్తారో చెబుతూ.. రాబోయే 4 వారాల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.



## ఆర్జేడీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీ యాదవ్

**న్యూఢిల్లీ :** రాష్ట్రీయ జనతాదళ్ పార్టీకి నూతన జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీ యాదవ్ నియమితులయ్యారు. ఆర్జేడీ కీలక సమావేశంలో పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఈ నియామకాన్ని ప్రకటించారు. పార్టీ అగ్రనేతల సమక్షంలో తేజస్వీకి నియామక లేఖను అందజేశారు. లాలూ కుటుంబంలో వివాదాలు చెలరేగుతున్న సమయంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిల చిన్న కుమారుడైన తేజస్వీ పార్టీలో ముఖ్య నేతగా కొనసాగుతున్నారు. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ బిహార్‌లో అతిపెద్ద పార్టీగా అవతరించడంలో తేజస్వీ కీలక పాత్ర పోషించాడు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సేవలు అందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి ఎన్నికల ప్రచారాల్లో చురుకుగా పాల్గొన్నారు. రాఘోపుర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, భాజపా అభ్యర్థి సతీశ్ కుమార్‌పై 14,532 ఓట్ల తేడాతో నెగ్గారు.




#### ఆక్రమణదారుల చేతుల్లోకి ఆర్జేడీ: లాలూ కుమార్తె

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య.. తేజస్వీపై పరోక్షంగా విమర్శలు చేశారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన తమ పార్టీని కొందరు వ్యక్తులు పూర్తిగా నాశనం చేయాలని చూస్తున్నారన్నారు. ఒకప్పుడు ప్రజల హక్కుల కోసం పోరాడిన పార్టీ ఇప్పుడు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆర్జేడీ దుస్థితికి కారణమైన అటువంటి వారిని ఆర్జేడీ కార్యకర్తలే ప్రశ్నిస్తారన్నారు.



## బంగ్లాదేశ్‌లో దారుణం..

### మరో హిందూ యువకుడి సజీవ దహనం

**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో మరో భయానక ఘటన చోటు చేసుకొంది. దుకాణంలో నిద్రిస్తున్న ఓ హిందూ యువకుడిని సజీవ దహనం చేశారు. ఈ ఘటన నార్సింగ్డి ప్రాంతంలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి ఓ దుకాణంపై అల్లరి మూకలు దాడి చేశాయి. షట్టర్ మూసివేసి పెట్రోల్ పోసి నిప్పు అంటించాయి. ఈ సమయంలో షాపులో నిద్రిస్తున్న చంచల్ భౌమిక్(23) అనే యువకుడు సజీవదహనం అయ్యాడు. చంచల్ మరణించాడని నిర్ధరించుకున్న తర్వాతే దుండగులు అక్కడి నుంచి పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మృతుడికి తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు. వీరిలో ఒకరు దివ్యాంగుడు. వీరి తండ్రి చాలా కాలం క్రితమే మృతి చెందాడు. చంచల్ ఆదాయంపైనే ఆ కుటుంబం ఆధారపడి జీవిస్తోంది. కుటుంబ పోషణ కోసం నార్సింగ్డి ప్రాంతంలోని ఓ గ్యారేజీలో అతడు గత ఆరేళ్లుగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. పథకం ప్రకారమే ఈ హత్య చేసినట్లు అతడి కుటుంబ సభ్యులు, చంచల్ యజమాని ఆరోపిస్తున్నారు. గతంలో బంగ్లాదేశ్‌లో దీపు చంద్రదాస్, ఖోకాన్ చంద్రదాస్ అనే వ్యక్తులను కూడా ఇదే విధంగా అల్లరిమూకలు హత్య చేసిన విషయం తెలిసిందే.

## బెంగాల్ మంత్రికి ఈసీ నోటీసులు

**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి స్థానిక మంత్రి శశి పంజాకు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఇటీవల చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో మంత్రి ఓటరు మ్యాపింగ్‌కు సంబంధించిన పలు విషయాలపై స్పష్టత లేకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. దీనిపై మంత్రి స్పందిస్తూ.. 2002లో రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ సమయంలో సంబంధిత పత్రాలన్నీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ తన వివరాలు లేవని అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. సర్ విచారణకు హాజరవుతానని తెలిపారు. తృణమూల్ ఐటీ సెల్ విభాగం ఇన్‌ఛార్జి దేబాంశు భట్టాచార్యకు కూడా ఈసీ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. తనకు, తన కుటుంబ సభ్యులకు ఓటరు మ్యాపింగ్ విషయంలో ఈసీ నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తమ ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకపోయినా.. భాజపా కృత్రిమ మేధను ఉపయోగించి పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారిని టార్గెట్ చేస్తోందని ఆరోపించారు.



## ఎవరికీ తలవంచం : విజయ్

**మహాబలిపురం :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఒంటరిగానే విజయం సాధిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు. మరికొద్ది నెలల్లో జరిగేది ఎన్నికల పోరు కాదని.. ప్రజాస్వామ్య యుద్ధమన్నారు. మహాబలిపురంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం టీవీకే పార్టీకి 'విజిల్' గుర్తు కేటాయించిన సంగతి తెలిసిందే. దీన్ని ఆయన ఇక్కడ ఆవిష్కరించారు. 'తమిళనాడు ఎన్నికల్లో ఒంటరిగానే విజయం సాధిస్తాం. అందుకు తగ్గ సైన్యం మావద్ద ఉంది. ఇది ఎన్నికల పోరు కాదు.. ప్రజాస్వామ్య యుద్ధం. అన్నాడీఎంకే ప్రత్యక్షంగా.. డీఎంకే పరోక్షంగా భాజపాకి సరెండర్ అయ్యాయి. టీవీకే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గదు. డీఎంకే ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చింది.ఎవరికీ తలవంచం.. దేనికీ రాజీపడే ప్రసక్తే లేదు. మనమందరం కలిసికట్టుగా ఉంటే విజయం మనదే. రాష్ట్రంలో అవినీతి అంతానికి సమయం ఆసన్నమైంది' అని విజయ్ అన్నారు. దుష్ట శక్తులను, అవినీతిపరులను ఎదుర్కొనే ధైర్యం తమ పార్టీకి మాత్రమే ఉందన్నారు.



# రోజూ వ్యాయామం కుదరడం లేదా?

## వీకెండ్‌లో కానీయండి



రోజూ వ్యాయామం చేయటం కుదరడం లేదా? కనీసం వారాంతాల్లోనైనా చేయండి. రోజూ చేసే వ్యాయామంతో సమానంగా ఇదీ ప్రయోజనాలు కల్పించే అవకాశముందని మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్ పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనంలో భాగంగా చేతికి యాక్సిలరోమీటర్లతో కూడిన పరికరాలు ధరించిన సుమారు 90వేల మంది ఆరోగ్య వివరాలను విశ్లేషించారు. వీరిలో రోజూ వ్యాయామం చేసేవారు, వారాంతాల్లో చేసేవారు, అంతగా చేయనివారిని బృందాలుగా విభజించారు.

వారానికి 150 నిమిషాల కన్నా తక్కువగా శ్రమ చేసేవారిని అంతగా వ్యాయామం చేయని వర్గంలో చేర్చారు. అందరిలోనూ మానసిక, జీర్ణకోశ, నాడీ సమస్యలతో పాటు మొత్తం 678 జబ్బుల తీరుతెన్నులను పరిశీలించారు. అంతగా వ్యాయామం చేయనివారితో పోలిస్తే- రోజూ చేసేవారితో పాటు వారాంతాల్లో చేసేవారిలోనూ 200కు పైగా జబ్బుల ముప్పు తక్కువగా ఉంటున్నట్టు తేలింది. వ్యాయామ ప్రయోజనాలు అధిక రక్తపోటు, మధుమేహం జబ్బుల విషయంలో మరింత బలంగా ఉండటం విశేషం. రోజూ వ్యాయామం చేసేవారికి అధిక రక్తపోటు ముప్పు 28%, వారాంత వీరులకు 23% తక్కువగా ఉంటోంది. అదే మధుమేహం ముప్పయితే వరుసగా 46%, 43% వరకూ తగ్గుతోంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారితో సమానంగా వారాంత వీరుల్లోనూ ప్రయోజనాలు కనిపించటానికి కారణమేంటి? వ్యాయామ తీరు కన్నా ఎంత వ్యాయామం చేశారనేది కారణం కావొచ్చని భావిస్తున్నారు. వారాంతాల్లో వ్యాయామం చేసేవారికి గుండె, రక్తనాళాల జబ్బుల ముప్పు తక్కువనే విషయం ఇప్పటికే తెలుసు. అయితే వీరికి కిడ్నీ జబ్బుల దగ్గరి నుంచి మూడ్ సమస్యల వరకూ ఇతరత్రా జబ్బుల ముప్పూ తక్కువేనని తాజా అధ్యయనం సూచిస్తోంది.



## సేవా సమితి ద్వారా సామాజిక సేవ మరింత విస్తరించాలి

- తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్య రెడ్డి
- అంబేద్కర్ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలి

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** పటాన్‌చెరు పట్టణంలోని స్థానిక చైతన్య నగర్ కాలనీలోని జగ్జీవన్ రామ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అంబేద్కర్ యువజన సేవా సమితి నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఆదిత్య రెడ్డి పాల్గొన్నారు. అతిథిగా తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రోటోకాల్. నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పాత కమిటీ సభ్యుల సేవలను అభినందిస్తూ, నూతన కార్యవర్గం సమాజ హితం కోసం నిరంతరం శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రతినిధులు, సేవా సమితి సభ్యులు మరియు స్థానిక యువజన నాయకులు పాల్గొన్నారు.



## నల్లగండ్ల హుడా లే ఔట్‌లో తారు రోడ్డు పనులు పరిశీలించిన సత్యనారాయణ రావు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా లేఔట్‌లో రాక్ గార్డెన్ నుంచి ఎస్‌బీఐ మెయిన్ రోడ్డు వరకు హెచ్‌ఎండిఏ నిధులతో చేపడుతున్న తారు రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ముస్తాక్, ప్రభాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజు, రాములు గౌడ్, అనిల్ కుమార్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ముప్పై ఐదేళ్ల నిరీక్షణకు తెర..

## సూర్యాపేటలో 'శిరీష' మిత్రుల జ్ఞాపకాల హరివిల్లు!

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** కాలం వెనక్కి వెళ్ళింది. ముప్పై ఐదేళ్ల నాటి జ్ఞాపకాలు మళ్ళీ చిగురించాయి. ఒకప్పుడు బడి బ్యాగులతో అల్లరి చేసిన ఆ చిచ్చరపిడుగులు, ఇప్పుడు సమాజంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడి, జుట్టు నెరిసినా మనసు మాత్రం మళ్ళీ బాల్యంలోకి వెళ్ళిపోయింది. సూర్యాపేట పట్టణంలోని శిరీష విద్యానికేతన్ హైస్కూల్ 1990-91 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం స్థానిక విజయ్ బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కనులపండువగా సాగింది. ఖండంతరాల గ్యాప్‌ను చెరిపేసిన స్నేహం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు శ్రీనివాస్. వృత్తిరీత్యా ఆస్ట్రేలియాలో స్థిరపడిన ఆయన, కేవలం తన చిన్ననాటి మిత్రులను కలుసుకోవాలనే తపనతో ఏడు సముద్రాలు దాటి సూర్యాపేట చేరుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. "దేశం ఏదైనా, హోదా ఏదైనా..నా స్నేహితుల మధ్య నేను మళ్ళీ ఆనాటి పదవ తరగతి శ్రీనునే" అని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. వివిధ ప్రాంతాల్లో డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా సెటిల్ అయిన మిత్రులంతా ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. నాడు తరగతి గదిలో చేసిన అల్లరి..శిరీష స్కూల్ గ్రౌండ్‌లో ఆడిన ఆటలు..గురువులు చెప్పిన పాఠాలు..ఇలా ప్రతి విషయాన్ని నెమరువేసుకుంటూ విజయ్ బ్యాంకెట్ హాల్ ప్రాంగణాన్ని నవ్వులతో ముంచెత్తారు. 35 ఏళ్ల తర్వాత మళ్ళీ అందరినీ ఇలా చూడటం ఒక వరంలా అనిపిస్తోంది. ఈ రోజు మేమందరం మా వృత్తులను, హోదాలను పక్కన పెట్టి మళ్ళీ విద్యార్థులుగా మారిపోయాము," అని పలువురు మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు. వ్యాఖ్యాతల ఆటపాటలు, సెల్ఫీలు, గ్రూప్ ఫోటోలతో సందడి నెలకొంది. మధ్యాహ్నం విందు భోజనం అనంతరం ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడున్నా, ఏ స్థితిలో ఉన్నా మిత్రుల కష్టం సుఖాల్లో తోడుండాలని ప్రతిన బూనారు. ఈ అపూర్వ కలయికను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అందరూ ధన్యవాదాలు తెలిపారు.




# ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం





**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** మియాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల, మక్త మహబూబ్ పేట్ పాఠశాల లో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా సంఘ సేవకులు, ప్రజా నాయకులు రామప్రభు చే విద్యార్థినులకు శానిటైజర్ కిట్లు పంపిణీ చేశారు. నేటి బాలికలే రేపటి మహిళలు సృష్టి కీ జీవం పోసే మాతృ మూర్తులు, వారిని భూమి కి ఉన్న సహనం తో పోల్చిన, ఆకాశంలో సగం అన్న అతిశయోక్తి కాదు అలాంటి బాలికలు వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుని శారీరకంగా, మానసికంగా బలంగా ఉండి అన్నీ రంగాలలో రాణించాలని, మహిళలు సంకల్పిస్తే సాధించలేనిది ఏది లేదు అంటూ నిరూపించాలని రామప్రభు అన్నారు. బాలికలందరికీ అంతర్జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తంయాదవ్, రాచమల్ల నాగేశ్వర్ గౌడ్, నిమ్మల రామకృష్ణ, రాజు, శేరిలింగంపల్లి కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్, రాజశేఖర్, గిరి, గంగాధర్, భాగ్యమ్మ, జ్యోతి, లతా, స్వరూప, ఎడ్ల కల్పన లతో పాటు పాఠశాలల ప్రిన్సిపాల్ లు వసుంధర, శ్రీకాంత్, భాగ్య , రేఖ, రాజుయాదవ్, అట్టేపల్లి లక్ష్మీనారాయణ ట్రస్ట్ , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## మంత్రి తుమ్మలను కలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

**దమ్మపేట, జనవరి 25:** మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి కలిసి, సత్తుపల్లి నియోజకవర్గంలో రాబోవు సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కల్లూరు, సత్తుపల్లి మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్ని వార్డుల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజలకు వివరించే విధంగా పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. అనంతరం సత్తుపల్లి నియోజక వర్గంలో పెండింగ్ లో ఉన్న పలు సమస్యలను మంత్రి తుమ్మలకు వివరించారు.



## మున్సిపల్ ఎన్నికల్లో 'క్లీన్ స్వీప్' లక్ష్యంగా పనిచేయాలిలి

- పార్టీ గెలుపే పరమావధిగా అందరూ సమన్వయంతో సాగాలి
- సర్వే ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక : మంత్రి పొంగులేటి
- ఇల్లందు నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

**ఇల్లందు, జనవరి 25:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇల్లందు మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మున్సిపల్ ముఖ్య నేతలు, ఆశావహులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ అతి త్వరలోనే ప్రారంభం కానుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. "వచ్చే నెల మధ్య నాటికి ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున పార్టీ శ్రేణులు ఇప్పుడే క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

### పారదర్శకంగా అభ్యర్థుల ఎంపిక

టికెట్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి వార్డులో ప్రజల ఆమోదం, అభ్యర్థి యోగ్యత ఆధారంగా శాస్త్రీయంగా సర్వే నిర్వహించి, ఆ నివేదికల ప్రకారమే బి-ఫామ్ ఇస్తామని వెల్లడించారు. పార్టీ పట్ల విధేయత, ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుందని, ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా అర్హులకే సీట్లు దక్కుతాయని భరోసా ఇచ్చారు. పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని మంత్రి కోరారు. "ఒకే వార్డులో ఎక్కువ మంది అభ్యర్థులు ఉండటం సహజం. కానీ బి-ఫామ్ ఒకరికే దక్కుతుంది. టికెట్ రాని మిత్రులు ఆందోళన చెందవద్దు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ గుర్తించి, భవిష్యత్తులో కో-ఆప్షన్ సభ్యులుగా లేదా ప్రభుత్వంలోని ఇతర పదవుల ద్వారా వారి రాజకీయ గౌరవానికి భంగం కలగకుండా చూసే బాధ్యత నాదే" అని హామీ ఇచ్చారు. పార్టీ లైన్ దాటకుండా, ప్రతి ఒక్కరూ అధికారిక అభ్యర్థి గెలుపు కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### అభివృద్ధికి నిధుల వెల్లువ

"ఇల్లందు అభివృద్ధికి ఇప్పటికే కోట్ల రూపాయల నిధులను కేటాయించాం. మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో మన అభ్యర్థులను గెలిపిస్తే, భవిష్యత్తులో మరింత భారీగా నిధులు తీసుకువచ్చి ఇల్లందు రూపురేఖలు మారుస్తా" అని మంత్రి వాగ్దానం చేశారు. తనను నమ్ముకున్న కార్యకర్తలను కుటుంబ సభ్యుల్లా కాపాడుకుంటానని, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు.



## ఏలూరు జిల్లా చింతంపల్లిలో పామాయిల్ తోటలను పరిశీలించిన మంత్రి తుమ్మల

**దమ్మపేట, జనవరి 25:** ఏలూరు జిల్లా పరిధిలోని చింతంపల్లి గ్రామంలో ఏలేటి కిషోర్ కు చెందిన గార్డెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పామాయిల్ లో కోకో, కంపోస్టింగ్, వర్మీ కంపోస్ట్, బ్యాక్టీరియా కల్చర్లు, పసుపు, కంపోస్టింగ్, వాటర్ హార్వెస్టింగ్ తో పాటు చేపల పెంపకం విధానాలను పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు ఏలేటి కిషోర్, వెంపాటి లక్ష్మీనారాయణ, మోరంపూడి నాగేశ్వరరావు, నున్న రత్నరావు ఉన్నారు.






# సింగరేణి బలం కార్మికుడే

- గనికార్మికుల శ్రమతోనే దేశానికి వెలుగు
- భద్రతే ప్రథమం- జీరో ప్రమాదాల లక్ష్యం
- సింగరేణిని రాజకీయాలకు అతీతంగా కాపాడాలి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 25:** కొత్తగూడెం ఏరియా పరిధిలోని 74 ఏళ్ల నాటి పీవీకే--5 అండర్‌గ్రౌండ్ గనిలో బొగ్గుగని కార్మికులతో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలు అండర్‌గ్రౌండ్ గనుల్లో పనిచేయడం గర్వకారణమని తెలిపారు. 136 సంవత్సరాల చరిత్ర గల సింగరేణి సంస్థ లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ, తెలంగాణతో పాటు దేశ అభివృద్ధికి కీలకంగా నిలుస్తోందన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో 74 శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని, కార్మికుల శ్రమ వల్లే మారుమూల ప్రాంతాల్లో కూడా వెలుగులు వెలుగుతున్నాయన్నారు. ప్రతి కార్మికుడి ప్రాణం అమూల్యమని, అందుకే జీరో ప్రమాదాల గనుల విధానాన్ని అమలు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా నాలుగు లక్షల బొగ్గుగని కార్మికులకు కోటి రూపాయల బీమా పథకం అమలులో ఉందని తెలిపారు. సింగరేణిని రాజకీయాలకు అతీతంగా కాపాడుకోవాలని, ఖర్చులు తగ్గిస్తూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బొగ్గు దిగుమతులు తగ్గించి, భవిష్యత్తులో ఎగుమతుల దిశగా దేశం ముందుకు వెళ్లాలన్నది ప్రధాని ఆలోచన అని పేర్కొన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ జరుగుతుందన్న ప్రచారం అవాస్తవమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.



# జనం మెచ్చిన వారికే టికెట్లు

- పైరవీలకు తావులేదు.. వారసత్వానికి చోటులేదు
- ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యత నాది
- శివరాత్రి లోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి!
- మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి

**ఖమ్మం, జనవరి 25:** "మున్సిపల్ ఎన్నికల నగారా మోగనుంది.. మనమంతా సిద్ధం కావాలి. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయమే తుది నిర్ణయం. పైరవీలకు ఇక్కడ తావులేదు. జనం కోరుకునే వ్యక్తికే బి-ఫామ్ అందుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగు లేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వార్డుల నుంచి తరలివచ్చిన పార్టీ ఇంచార్జీలు, ముఖ్య నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

### సర్వేల ఆధారంగానే ఎంపిక

టికెట్ల కేటాయింపుపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. "వారసత్వ రాజకీయాలకు నా వద్ద చోటు లేదు. నా రక్తసంబంధీకులకు ఎవరికీ టికెట్లు ఇవ్వను. ఇప్పటికే రెండు మూడు బృందాలతో క్షేత్రస్థాయిలో సర్వేలు చేయిస్తున్నాం. ప్రజలు ఎవరినైతే ఆదరిస్తారో, ఎవరికైతే గెలిచే సత్తా ఉందో వారికే అవకాశం దక్కుతుంది. ఓటర్ల మనసు గెలుచుకున్న వారే అభ్యర్థులుగా బరిలోకి దిగుతారు" అని పేర్కొన్నారు.

### రెచ్చగొడితే మోసపోవద్దు

పార్టీలో టికెట్ రాని వారు నిరాశ చెందవద్దని, అసంతృప్తితో ఇతర పార్టీల వైపు చూడవద్దని మంత్రి సూచించారు. "అధికారంలో ఉన్నాం కాబట్టి అందరికీ ఏదో ఒక రూపంలో సముచిత స్థానం కల్పిస్తాం. కొందరిని కో-ఆప్షన్ సభ్యులుగా, మరికొందరికి నామినేటెడ్ పదవుల ద్వారా గౌరవిస్తాం. పార్టీని కాదని స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని ఎవరైనా రెచ్చగొడితే మోసపోవద్దు. అటువంటి వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది" అని హెచ్చరించారు.

### మోడల్ మున్సిపాలిటీగా చేయడమే లక్ష్యం

ఏదులాపురం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా మార్చడమే తన లక్ష్యమని మంత్రి వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 15న శివరాత్రి లోపు ఎన్నికలు, కౌంటింగ్, ప్రమాణ స్వీకార కార్యక్రమం అంతా పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. "మీరు నా కళ్ళు, చెవుల వంటి వారు. మీ కష్టమే నాకు గౌరవం. నేను ఎప్పుడూ కార్యకర్తలను విస్మరించను. ప్రజలతో నిరంతరం మమేకమై ఉండే వారికే నా మద్దతు ఉంటుంది" అని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. అనంతరం స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

# ఓటు హక్కు విలువ తెలుసుకుని సద్వినియోగం పరుచుకోవాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 25 :** ప్రజాస్వామ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా, సద్వినియోగపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. ఆదివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నూతన ఓటర్లతో నిర్వహించిన సైకిల్ ర్యాలీని కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే పాలకులను ఎన్నుకునే అత్యున్నత హక్కు ఓటు హక్కు అని అన్నారు. ప్రజల అభిప్రాయాలకు ఆమోదయోగ్యంగా, ఎక్కువమంది ఆదరణ పొందిన ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించిందని తెలిపారు. గతంలో ఓటు హక్కు సాధన కోసం అనేక త్యాగాలు, ఉద్యమాలు, పోరాటాలు జరిగాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జాతీయ ఓటరు దినోత్సవం ప్రతి పౌరుడు ఓటు హక్కు విలువ, విశిష్టతను అవగాహన చేసుకునేందుకు, ప్రజాస్వామ్య వ్యవస్థలో తన పాత్రను గుర్తించేందుకు ఒక మంచి అవకాశమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా నూతన ఓటర్లు, యువత ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ నూతన ఓటర్లు, యువత, ప్రజలు, అధికారులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ ప్రతిజ్ఞలో భాగంగా "భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై సంపూర్ణ విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య




సంప్రదాయాలను కాపాడుతామని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల నిర్వహణను పరిరక్షిస్తామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా మా ఓటు హక్కును వినియోగిస్తామని" ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద ఓటు హక్కు వినియోగం, పై నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రజాస్వామ్య విలువలు, ఓటు ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా ఈ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ రైల్వే స్టేషన్ వరకు కొనసాగగా, ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున యువత, నూతన ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియోగంపై అవగాహన సందేశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖల అధికారి పరంధామ రెడ్డి, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్ , పాల్వంచ తాసిల్దార్ ధారా ప్రసాద్, ఎన్నికల ట్రైనర్ సాయి కృష్ణ,ఎన్నికల సిబ్బంది నవీన్,సంబంధిత శాఖల అధికారులు, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## తుమ్మలను కలిసిన గంగారం 15వ బెటాలియన్ పోలీసులు



**దమ్మపేట, జనవరి 25:** ఆదివారం 15వ బెటాలియన్ గంగారంకు చెందిన పలువురు పోలీసు సిబ్బంది రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మండల పరిధి గండుగులపల్లి లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సుదీర్ఘ కాలపు బదిలీల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది విన్నపాన్ని సావధానంగా విన్న మంత్రి, ప్రస్తుతం బదిలీల అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం లభించేలా చూస్తానని వారికి భరోసా ఇచ్చారు. మంత్రి స్పందన పట్ల పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగ ప్రసాద్ తదితరులు వున్నారు.



## ఫిబ్రవరి 3 నుంచి సాతి భవాని మహాజాతర

- వారం రోజులపాటు ప్రత్యేక పూజలు, భోగ్ బండారో
- అన్ని అనుమతులతో ఘన ఏర్పాట్లు
- యావత్ హిందూ సమాజం తరలిరావాలని పిలుపు

**కొత్తగూడెం, జనవరి 25 :** తెలంగాణ రాష్ట్ర బంజారాల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సాతి భవాని అమ్మవార్ల మహాజాతర ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వారం రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైస్ చైర్మన్ బానోత్ వీరూ నాయక్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల క్రాస్ రోడ్ కొత్తూరు గ్రామ సమీపంలో ఈ మహాజాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల నుంచి అన్ని అనుమతులు లభించాయని చెప్పారు. తొలుత ఈనెల 27 నుంచి నిర్వహించాల్సిన జాతర అనివార్య కారణాలతో ఫిబ్రవరి 3కి వాయిదా పడిందన్నారు. మహాజాతరలో భాగంగా ప్రత్యేక హోమాలు, శాంతి పూజలు, భోగ్ బండారో నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇటీవల జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 15న జరగనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, రాష్ట్రవ్యాప్తంగా వేడుకలకు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మహాజాతరకు బంజారాలు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బంజారా సంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



## కొండకల్‌లో 50వ వారం హనుమాన్ చాలీసా మహోత్సవం

**చేవెళ్ల, జనవరి 25 :** చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం 50వ వారాన్ని భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయ స్వామికి ప్రత్యేక దీపారాధనలు, పుష్పాలంకరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడికె కార్తీక్ హాజరై ప్రసంగిస్తూ శ్రీరాముని ధర్మ పరాక్రమం, హనుమంతుని అపార బలం, చత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వాన్ని వివరించారు. కుల, మత భేదాలకు అతీతంగా ఐకమత్యంతో సమాజ హితానికి అందరూ కలిసికట్టుగా నిలవాలని పిలుపునిచ్చారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు భారతీయ సంప్రదాయాల గొప్పతనాన్ని వివరించారు. సుమారు 1500 మంది భక్తులు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు.



# పర్యావరణానికి 'ప్లాస్టిక్' ఉరితాడు

## సమాజాన్ని మౌనంగా నాశనం చేస్తున్న ప్లాస్టిక్!

**దమ్మపేట, జనవరి 25: నేడు మానవ మనుగడకు ప్లాస్టిక్ ఒక పెను సవాలుగా మారింది. ఆధునిక కాలంలో ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకు ప్రతి పనిలోనూ ప్లాస్టిక్ వాడకం భాగమైపోయింది. నేటి ఆధునిక జీవనశైలిలో ప్లాస్టిక్ అనివార్యంగా మారింది. తక్కువ ఖర్చు, సులభంగా లభ్యత కారణంగా ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగింది. అయితే ఇదే ప్లాస్టిక్ నేడు సమాజానికి, పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతోంది.**

గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పేరుకుపోతున్నాయి విపరీతమైన ప్లాస్టిక్ వాడకం సమాజానికి తీరని నష్టం కలిగిస్తుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఒక్కసారి వాడి పారేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ భూమిని విషతుల్యం చేస్తోంది. ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలవడానికి వందల ఏళ్లు పడుతుంది. ఇవి భూమి పొరల్లో చేరడం వల్ల వర్షపు నీరు భూగర్భంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడమే కాకుండా, భూసారం తగ్గి పంట దిగుబడులపై ప్రభావం చూపుతోంది. పట్టణాల్లో డ్రైనేజీ వ్యవస్థలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి, స్వల్ప వర్షానికే వీధులన్నీ జలమయమవుతున్నాయి.

రోడ్లపై పారేస్తున్న ప్లాస్టిక్ కవర్లను ఆహారంగా భావించి పశువులు తింటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు ప్లాస్టిక్ కవర్లను మేతగా భావించి తినడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నాయని, వెటర్నరీ వైద్యులు చెబుతున్నట్లు ఆవులు, గేదెల కడుపుల్లో భారీగా ప్లాస్టిక్ చేరడం వల్ల వాటి జీర్ణవ్యవస్థ దెబ్బతిని మృత్యువాత పడుతున్నాయి. మరోవైపు నదులు, సముద్రాల్లో చేరుతున్న ప్లాస్టిక్ వల్ల జలచరాలు అంతరించిపోతున్నాయి. సూక్ష్మ ప్లాస్టిక్ (మైక్రో ప్లాస్టిక్) రేణువులు వివిధ మార్గాల ద్వారా తిరిగి మానవ శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్నాయి. ఇటీవల మైక్రో ప్లాస్టిక్‌లు మనిషి రక్తం, ఊపిరితిత్తుల్లో కూడా గుర్తించబడటం ఆందోళన కలిగించే అంశం. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులు, జనపనార, పేపర్ సంచులు వాడాలని, శుభకార్యాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్ల స్థానంలో అరిటాకులు లేదా విస్తరాకులను వినియోగించాలని పర్యావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరుతున్నారు. "మనం ప్లాస్టిక్‌ను విడిచిపెట్టకపోతే, అది మనల్ని పర్యావరణం నుంచి దూరం చేస్తుందని అని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొని ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించినప్పటికీ, ప్రజల నిర్లక్ష్యం వల్ల పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యావరణ కార్యకర్తలు ప్రజల్లో అవగాహన పెంచడమే ఏకైక పరిష్కారమని సూచిస్తున్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని నిపుణులు సూచిస్తున్నారు.










# అదే దూకుడు

## అభిషేక్, సూర్య విధ్వంసం

## 10 ఓవర్లలోనే 154 పరుగుల ఛేదన

- విజృంభించిన బుమ్రా, హార్దిక్
- మూడో టీ20లో కివీస్‌పై భారత్ ఘనవిజయం
- సిరీస్ కైవసం

**గువాహటి :** భారత్‌ది అదే ఆధిపత్యం.. అదే దూకుడు..! బంతితో విజృంభించి బ్యాట్‌తో బాదేసిన సూర్య సేన.. మూడో టీ20లో న్యూజిలాండ్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. సిరీస్‌లో 3–0 ఆధిక్యం సంపాదించింది. ఆదివారం మొదట కివీస్ 9 వికెట్లకు 153 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (48; 40 బంతుల్లో 6x4, 1x6), మార్క్ చాప్‌మన్ (32; 23 బంతుల్లో 2x4, 2x6), మిచెల్ శాంట్నర్ (27; 17 బంతుల్లో 3x4, 1x6) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జస్ప్రీత్ బుమ్రా (3/17), రవి బిష్ణోయ్ (2/18), హార్దిక్ పాండ్య (2/23) ప్రత్యర్థిని కట్టడి చేశారు. అభిషేక్ శర్మ (68 నాటౌట్; 20 బంతుల్లో 7x4, 5x6), సూర్యకుమార్ (57 నాటౌట్; 26 బంతుల్లో 6x4, 3x6) సుడిగాలి ఇన్నింగ్స్‌లతో భారత్ కేవలం 10 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఇషాన్ కిషన్ (28; 13 బంతుల్లో 3x4, 2x6) కూడా మెరిశాడు. బుధవారం విశాఖపట్నంలో నాలుగో టీ20 జరగనుంది.




### బంతి బౌండరీ దాటడమే లక్ష్యంగా..

లక్ష్యమేమీ పెద్దది కాదు. కివీస్ కష్టపడిన తీరు చూస్తే.. మరీ తేలిగ్గా కూడా అనిపించలేదు. అలాంటి స్థితిలో ఛేదనలో తొలి బంతికే సంజు శాంసన్(0) వికెట్ కోల్పోయింది టీమ్ఇండియా. వైఫల్యాలను కొనసాగిస్తూ.. హెన్రీ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు శాంసన్. వికెట్ పడినా కూడా తొలి ఓవర్ ముగిసే సరికి భారత్ 16/1తో నిలిచింది. కారణం ఇషాన్. వరుసగా రెండు సిక్స్‌లు, ఫోర్ బాదిన అతడు భారత ఇన్నింగ్స్‌కు వేగాన్ని అందించాడు. ఆ తర్వాత ఓవర్లో అభిషేక్ సిక్స్‌తో ఆ జోరు కొనసాగింది. 3 ఓవర్లకు భారత్ 49/1తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. సోధి బౌలింగ్‌లో ఇషాన్ ఔటైనా.. అభిషేక్ తగ్గలేదు. డఫీ వేసిన ఆరో ఓవర్లో అతడు టాప్‌గేర్‌కు వెళ్లిపోయాడు. ఆ ఓవర్లో 2 సిక్స్‌లు, 2 ఫోర్లు కొట్టిన అభి.. కేవలం 14 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. గత మ్యాచ్‌లో ఫామ్‌లోకి వచ్చిన సూర్యకుమార్ కూడా రెచ్చిపోయాడు. సోధి బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదిన అతడు..శాంట్నర్ బౌలింగ్‌లో మరో సిక్స్, ఫోర్ కొట్టాడు. అభిషేక్ బలమైన పుల్ షాట్లు, కట్ షాట్లతో పరుగులు చేస్తే.. సూర్య తన శైలిలో ర్యాంప్ షాట్లు, గ్లాన్స్ సిక్స్‌లతో అలరించాడు. దీంతో భారత్ సాధించాల్సిన లక్ష్యం కర్పూరంలా కరిగిపోయింది. సమీకరణం 66 బంతుల్లో 15 పరుగులుగా మారింది. ఫిలిప్స్ వేసిన పదో ఓవర్లో 6, 4, 4 కొట్టిన సూర్య.. 25 బంతుల్లో అర్ధసెంచరీ చేయడమే కాక భారత్‌కు ఘన విజయాన్ని అందించాడు. 60 బంతులు ఉండగానే టీమ్ఇండియా గెలిచింది.

### రాణించిన బౌలర్లు

అంతకుముందు భారత బౌలర్లు న్యూజిలాండ్‌కు కళ్లెం వేశారు. తొలి ఓవర్లోనే డెవోన్ కాన్వే (1)ను హర్షిత్ రాణా ఔట్ చేశాడు. ముందుకొచ్చి మిడాఫ్ మీదుగా షాట్ ఆడదామని ప్రయత్నించిన కాన్వే.. హార్దిక్ పట్టిన ఓ మెరుపు క్యాచ్‌కు వెనుదిరిగాడు.
ఈ పర్యటనలో కాన్వేను ఔట్ చేయడం హర్షిత్‌కు ఇది అయిదోసారి కావడం విశేషం. ఆ తర్వాతి ఓవర్లో కివీస్‌కు మరో షాక్ తగిలింది. హార్దిక్ ఓ షార్ట్ బంతితో రచిన్ రవీంద్ర(4) కథ ముగించాడు. 2 ఓవర్లకు 17/2తో న్యూజిలాండ్ ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో ఫిలిప్స్ అడపాదడపా ఫోర్లు కొట్టి స్కోరు పెంచాడు. 5 ఓవర్లకు న్యూజిలాండ్ 34/2తో నిలిచింది. గత మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకుని తిరిగొచ్చిన బుమ్రా ఈ మ్యాచ్‌లో అదరగొట్టాడు. ఆరో ఓవర్లో సీఫర్ట్(12)ను అతడు ఓ అద్భుతమైన బంతితో బౌల్డ్ చేశాడు. దీంతో పవర్ ప్లే ఆఖరికి కివీస్ 36/3తో నిలిచింది. బుమ్రా, బిష్ణోయ్ కట్టుదిట్టంగా బంతులు వేయడంతో కివీస్ బ్యాటర్లు వేగంగా పరుగులు చేయలేకపోయారు. ఈ స్థితిలో కుల్‌దీప్ వేసిన తొమ్మిదో ఓవర్లో చాప్‌మన్ 6, 4.. ఫిలిప్స్ ఓ సిక్స్ బాదడంతో స్కోరు బోర్డు వేగాన్ని అందుకుంది. 11 ఓవర్లకు 82/3తో కివీస్ కోలు కుంది. కానీ గేర్లు మార్చాల్సిన సమయంలో చాప్‌మన్‌తో పాటు మిచెల్ (14), ఫిలిప్స్ ఔట్ కావడంతో ఆ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. కానీ కెప్టెన్ శాంట్నర్ పోరాడడంతో న్యూజిలాండ్ కాస్త గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది.

# అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్

### రోహిత్, హర్మన్‌లకు పద్మశ్రీ పురస్కారాలు

**దిల్లీ:** భారత టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్‌ను దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మ భూషణ్ వరించింది.






2026లో ఈ అవార్డు పొందిన ఏకైక క్రీడాకారుడు అతడే. సారథులుగా భారత్‌కు ప్రపంచకప్‌లు అందించిన రోహిత్‌శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ పురస్కారం లభించింది. కేంద్ర ప్రభుత్వం ఆదివారం పద్మ అవార్డులను ప్రకటించింది. భారత హాకీ మాజీ ఆటగాడు బల్‌దేవ్ సింగ్, మహిళల హాకీ మాజీ గోల్ కీపర్ సవిత పునియా, పారా హైజంపర్ ప్రవీణ్‌కుమార్, పారా పవర్ లిఫ్టర్లు భగ్వాన్‌దాస్ రైక్వార్, పజనివేల్‌లు కూడా పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. దిగ్గజ రెజ్లింగ్ కోచ్ వ్లాదిమర్ మెస్త్‌విరిష్విలి (జార్జియా)ని మరణానంతరం పద్మశ్రీ అవార్డుతో గౌరవించారు. సుశీల్ కుమార్, యోగేశ్వర్ దత్, బజ్‌రంగ్ పునియా, విజయ్ దహియా వంటి రెజ్లర్లకు అతడు కోచ్‌గా వ్యవహరించాడు.

### దూకుడైన కెప్టెన్ రోహిత్

దూకుడైన బ్యాటింగ్‌తో హిట్‌మ్యాన్‌గా పేరుతెచ్చుకున్న రోహిత్ శర్మ.. కెప్టెన్‌గానూ భారత క్రికెట్‌పై బలమైన ముద్ర వేశాడు. అతడి సారథ్యంలోనే టీమ్ఇండియా 2024లో టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. 2025లోనూ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా చేజిక్కించుకుంది. రోహిత్ వన్డేల్లో 11577, టెస్టుల్లో 4301, టీ20ల్లో 4231 పరుగులు చేశాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 50 సెంచరీలు, 111 అర్ధసెంచరీలు సాధించాడు. మాజీ కెప్టెన్ రోహిత్ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. మిగతా రెండు ఫార్మాట్ల నుంచి అతడు రిటైరయ్యాడు.

### హర్మన్‌ప్రీత్ సారథ్యంలో..

భారత క్రికెట్‌కు 2025 మైలురాయిలా నిలిచిపోయిన నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ కౌర్‌కు పద్మశ్రీ అవార్డు వరించింది. ఆమె సారథ్యంలోనే భారత జట్టును నిరుడు తొలిసారి ఐసీసీ మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకుంది. వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను భారత జట్టు ఓడించిన సంగతి తెలిసిందే. ధోని తర్వాత సొంతగడ్డపై ప్రపంచకప్ అందుకున్న భారత రెండో కెప్టెన్‌గా హర్మన్ ఘనత సాధించింది.



www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# క్రేజీ అవుట్ ఫిట్‌లో కృతి శెట్టి

'ఉప్పెన' సినిమాతో ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్‌గా మారిపోయిన కృతి శెట్టి గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. తన ఫస్ట్ సినిమాతోనే బేబమ్మగా తెలుగు ఆడియన్స్ మదిలో నిలిచిపోయింది. దీంతో ఈ క్యూట్ హీరోయిన్‌కు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా చాలా సినిమాల్లో నటించినా ఉప్పెన లాంటి హిట్ అయితే రాలేదు. దీంతో కొన్ని రోజులు తెలుగు ఇండస్ట్రీకి దూరమైంది. ప్రజెంట్ ప్రదీప్ రంగనాథ్ హీరోగా నటిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' మూవీలో నటిస్తున్న ఈ చిన్నది.. రీసెంట్‌గా స్టార్ హీరో కార్తి నటించిన 'అన్నగారు వస్తారు' మూవీతో మన ముందుకు వచ్చింది. నలన్ కుమార స్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. అయితే థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇదిలా ఉంటే.. ఈ భామ సోషల్ మీడియాలో చేసే రచ్చ మామూలుగా ఉండదు. నిత్యం స్టైలిష్ వేర్ డ్రెస్సులతో కుర్రకారును ఫిదా చేస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా కృతి శెట్టి తన ఇన్‌స్టా అకౌంట్‌లో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో క్రేజీ అవుట్ ఫిట్‌లో కిర్రాక్ ఫొటోస్ షేర్ చేసింది. యద అందాలు ఆరబోస్తూ వావ్ అనిపించింది. ఇక వాటిని షేర్ చేస్తూ.. 'ఎందుకంటే సరైన దృష్టిలో, మీరు ఎల్లప్పుడూ కళగానే ఉంటారు' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు కాకరేపుతున్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# సైన్స్ ఫిక్షన్ సినిమాలో శ్రీలీల

పెళ్ళి సందడి' చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన యంగ్ బ్యూటీ శ్రీలీల గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఆ తర్వాత 'ధమాకా'తో మాస్ రాజా సరసన అదిరిపోయే స్టెప్పులేసి గ్లోబల్ స్థాయిలో పాపులర్ అయ్యారు. తెలుగులో టాప్ హీరోలందరి సరసన అవకాశాలు దక్కించుకుంటూ ఒకానొక సమయంలో 'బిజీయెస్ట్ హీరోయి-న్'గా పేరు తెచ్చుకున్న శ్రీలీల కెరీర్ గ్రాఫ్ ప్రస్తుతం కాస్త ఒడిదుడుకులకు లోనవుతోంది. అలా తన అందం, అద్భుతమైన డ్యాన్స్‌తో టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించిన శ్రీలీల, ఇటీవల 'పరాశక్తి' సినిమాతో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. శివకార్తికేయన్ సరసన నటించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ, కథనంలో లోపాల వల్ల బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాన్ని అందుకుంది. దీంతో తమిళంలో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలన్న ఆమె ఆశలకు కొంత నిరాశ ఎదురైంది. 'పరాశక్తి' ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, శ్రీలీల క్రేజ్ మాత్రం తగ్గలేదు. తాజా సమాచారం ప్రకారం, యువ దర్శకుడు, నటుడు ప్రదీప్ రంగనాథన్ తెరకెక్కించబోయే కొత్త సైన్స్ ఫిక్షన్ సినిమాలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా ఎంపిక చేసే ఆలోచనలో ఉన్నారట. ఇప్పటికే ఈ చిత్రంలో మీనాక్షి చౌదరిని ప్రధాన కథానాయికగా ఎంపిక చేయగా, మరో కీలక పాత్ర కోసం శ్రీలీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మరి ఈ సినిమాతోనైనా ఈ చిన్నదాని ఖాతాలో హిట్ పడుతుందో లేదో చూడాల్సి ఉంది.





# ట్రెడిషనల్‌గా కీర్తి సురేష్

స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'నేను లోకల్' సినిమాతో తెలుగు ఆడియన్స్‌కు పరిచయమైన ఈ చిన్నది అనతి కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నది. అలా దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. ఇక 'మహానటి', 'దసరా' సినిమాలతో ఈ అమ్మడి రేంజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ప్రజెంట్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ సరసన రౌడీ జనార్ధన్ మూవీలో యాక్ట్ చేస్తోంది. ఇక కీర్తి సురేష్ పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. తన చిన్ననాటి స్నేహితుడైన ఆంటోని తట్టిల్‌ని ప్రేమించి ఏడాది క్రితం డిసెంబర్ 12న వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక అప్పటి నుంచి ఈ జంట ఎంతో అన్యోన్యంగా ఉంటూ వేకేషన్స్‌కు తిరుగుతూ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ భామ ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్యారెట్ గ్రీన్ కలర్ ట్రెండీ అవుట్ ఫిట్‌లో ఇయర్ రింగ్స్, కళ్లకు కాటుక, రింగ్స్, నెక్లెస్‌తో చాలా ట్రెడిషనల్‌గా కనిపించింది. కింద బ్లూ కలర్ జీన్స్‌తో టాప్‌ను పెయిరప్ చేసింది. నవ్వుతూ తన స్టైల్‌తోనే మెస్మరైజ్ చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com